

మాట్లాడుతున్న ఆలయ ఈవో అంజనీదేవి, ఆలయ ప్రధాన అర్చకులు

గాడి తప్పిన పల్లె పాలన

- జడ్పీ, ఎంపీపీలకు జనరల్‌ఫండ్ సైతం కరువు
- ఎస్ఎఫ్‌సీ నిధులకు సైతం గండి
- ఫైనాన్స్ కమీషన్ నిధుల కోసం ఎదురుచూపులు
- పల్లెల్లో కనీస సౌకర్యాలు కరువై తల్లడిల్లుతున్న జనం

పల్లె ప్రజలకు బాసటగా నిలవాల్సిన స్థానికసంస్థలు నిధుల కొరతతో తల్లడిల్లుతున్నాయి. ప్రభుత్వం ద్వారా ప్రతిఏటా జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లకు అందాల్సిన నిధులు నిలిచిపోవడంతో పల్లెపాలన గాడితప్పింది. గ్రామీణ ప్రజలకు మౌలిక సౌకర్యాలను సైతం అందించలేకపోతున్నారు. జనం సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ పాలకులు మాత్రం ఆ దిశగా పట్టించుకోకపోవడం ప్రజల ఆగ్రహానికి కారణమవుతోందంటున్నారు.



నిర్మల్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఇదే

నిర్మల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాలుగైదు సంవత్సరాల నుంచి నిధుల కొరతతో స్థానికసంస్థలు సతమతమవుతున్నాయి. ఏళ్ల నుంచి జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు సైతం నిధులు విడుదలకాకపోతుండడం ప్రజల అసంతృప్తికి కారణమవుతోంది. 2011 జనాభా లెక్కలప్రకారం నిర్మల్ జిల్లాలో 5,14,114 లక్షల మంది జనాభా ఉన్నట్లు వెల్లడైంది. అయితే ఒక వ్యక్తికి జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో మౌలిక సౌకర్యాల కోసం రూ.4లు, ఎంపీకి రూ.8చొప్పున అందించాల్సి ఉంటుంది. ప్రతియేటా 25 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఈ నిధులు మూడుసంవత్సరాల నుంచి నిలిచిపోయాయి. జనరల్ ఫండ్‌తో పాటు స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్, 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం జడ్పీ, ఎంపీపీలు, పంచాయతీలకు అందడం లేదు. కొంతకాలం క్రితం కొత్తగా ఏర్పడిన సోన్, బాసర, దస్తూరాబాద్, నర్సాపూర్(జి), పెంబి మండలాల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులను సక్రమంగా విడుదల చేయని కారణంగా పల్లెప్రజలంతా కనీస సౌకర్యాలకు నోచుకోకుండా ఇబ్బందుల పాలవుతున్నారు. దీంతో పాటు కొత్తగా ఏర్పాటైన మండలాల్లో ప్రజాపరిషత్ కార్యాలయాలు లేక ఆ మండలాల్లో పరిపాలన గాడితప్పుతోంది.

కష్టతరంగా కార్యాలయాల నిర్వహణ..

కాగా జడ్పీతో పాటు ఎంపీపీ కార్యాలయాల నిర్వహణ సంబంధిత అధికారులకు కష్టతరంగా మారింది. ప్రభుత్వం నిర్వహణకు సంబంధించిన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయకపోతుండడంతో కనీససౌకర్యాలు కరువయ్యాయి. ప్రతినెల కార్యాలయాల నిర్వహణకు అప్పులుచేయాల్సిన పరిస్థితులున్నాయని సంబంధిత అధికారులు బహిరంగంగా పేర్కొంటుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అలాగే పారిశుధ్య కార్మికులకు సైతం జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. రెండునెలల నుంచి పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకపోతుండడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ దిశగా నిధులు చెల్లించాలని కోరుతున్నారు.

జనరల్ ఫండ్ నిధులకు గండి...

జనరల్‌ఫండ్ నిధులతో చేపట్టే పనులకు సంబంధించి 15 శాతం ఆఫీసు ఖర్చులకు కేటాయిస్తారు. అలాగే మరో 15 శాతం దళితవాడలో అభివృద్ధి పనులు చేయడం, ఆరుశాతం నిధులతో ఎస్టీ వార్డుల అభివృద్ధితో పాటు 15 శాతం నిధులతో తాగునీటి అవసరాల కోసం వ్యయం చేయాల్సి ఉంటుంది. అలాగే రిజిస్ట్రేషన్‌ల ద్వారా వచ్చేసెస్ నిధులు కూడా అందలేదు. సోషల్ ఎకనామిక్ సర్వేకు సంబంధించిన డబ్బులు అందకపోవడంతో ప్రైవేటు ఆపరేటర్‌లు, బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే గ్రామపంచాయతీల్లో ఖర్చుపెట్టిన రూ.4.12 కోట్లకు సంబంధించి చెక్కులు జారీ చేసినప్పటికీ ట్రెజరీల్లో బిల్లులు పాస్‌కావడం లేదు. రెండు సంవత్సరాల నుంచి రూ.1.12 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉం ది. దీంతో పాటు జడ్పీటీసీ పరిధిలో ఎస్ఎఫ్‌సీ కింద చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు విడుదల కాలేదు. రూ.6.31 కోట్ల బిల్లులకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. రెండు సంవత్సరాల నుంచి నిధులు విడుదల కాకపోతుండడంతో పనులు చేసిన జడ్పీటీసీ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం జిల్లాలోని పలువురు జడ్పీటీసీసభ్యులు కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి రూ.6.31 కోట్లను విడుదల చేయాలని కోరారు. 2023-2024 ఆర్థికసంవత్సరానికి సంబంధించి ఈ నిధులు విడుదల కావాల్సి ఉంది. అయితే తమ పదవి గడువు ముగిసినప్పటికీ నిధులు మంజూరుకాకపోతుండడంతో తాము చేసిన అప్పులను తీర్చలేక ఆర్థిక ఇక్కట్లకు గురవుతున్నామని మాజీ జడ్పీటీసీలు వాపోతున్నారు.



అద్దెభవనంలో కొనసాగుతున్న దస్తురాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం

నవరాత్రికి ఏర్పాట్లు

బాసర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో శారదీయా నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో అంజనాదేవి తెలిపారు. శనివారం ఆలయ ఈవో అంజనాదేవి ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్‌పూజారీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు తొమ్మిది రూపాలలో భక్తులకు సరస్వతమ్మ దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి చెంత శరన్నవరాత్రి పూజలు, అర్చన, శ్రీ చక్ర అర్చన పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 29న అమ్మవారి జన్మనక్షత్రం మూలనక్షత్రాన్ని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా సాధారణ ప్రత్యేక అక్షరాభ్యాస పూజలు క్యూలైన్, సర్వదర్శన ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మూల నక్షత్రం సందర్భంగా భక్తులకు చిన్నారులకు ఉచితంగా పాలు, బిస్కెట్లు అరటిపండు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంతో పాటు ఉపాలయాలను విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్‌లో తాగునీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయప్రాంగణంలో వైద్యశిబిరం, బయోటాయిలెట్లు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. నవరాత్రులు భక్తుల కోసం సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. గోదావరి నది తీరం వద్ద పుణ్యస్నానాలకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా గజఈతగాళ్ళు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. పోలీసులు స్వచ్ఛంద సేవ సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు సేవలు అందించనున్నారని తెలిపారు. సమావేశంలో ఆలయ ఏఈవో ఓ సుదర్శన్‌గౌడ్, సూపరిండెంట్ శివరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

నంది గుండం దుర్గామాత దేవస్థానంలో...

నిర్మల్ : శ్రీశ్రీ నందిగుండం ప్రసన్న దుర్గామాత దేవస్థానంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటాచారి, ఆలయ అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డిల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. నిత్యాన్నదానం ఉంటుందన్నారు.



నందిగుండం ప్రసన్న దుర్గామాత

బాసరోత్సవాలకు భారీ భద్రత : ఎస్పీ

బాసర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలను పురష్కరించుకొని భారీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మీల చెప్పారు. ఉత్సవాల కాలంలో భక్తులు అధిక సంఖ్యలో రానున్న కారణంగా ట్రాఫిక్ రద్దీ లేకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించామని పేర్కొన్నారు. బాసర ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు, షీటీమ్స్, క్యూఆర్‌టీ టీమ్స్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, డాగ్‌స్క్వాడ్ నియమిస్తున్నట్లు చెప్పారు. మహిళ భక్తుల భద్రత కోసం నిర్మల్ జిల్లా మహిళ ప్రత్యేక బృందం అయిన శివంగి దళాలు పని చేస్తాయని తెలిపారు. భక్తులు శాంతి, భద్రత వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

జిల్లా అధికారులపై చీఫ్ సెక్రెటరీకి ఫిర్యాదు

- భైంసా మున్సిపల్ మాజీచైర్మన్ జాబీర్ అహ్మద్

భైంసా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గుత్తాధిపత్య వ్యవహారశైలితో వ్యవహరిస్తున్న అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్‌పై చీఫ్ సెక్రెటరీ రామకృష్ణరావ్‌కు ఫిర్యాదు చేశానని భైంసా మున్సిపల్ మాజీచైర్మన్ జాబీర్ అహ్మద్ వెల్లడించారు. శనివారం భైంసాలోని తన నివాసగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మున్సిపల్ ప్రత్యేకాధికారి హోదాలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ అధికార యంత్రాంగంపై నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. మున్సిపాల్టీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ తనదిగా పేర్కొన్న ప్రైవేటు వ్యక్తికి సంబంధిత షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని కట్టబెట్టే రీతిలో వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఇదే క్రమంలో భైంసా సబ్‌కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అజ్మీర సంకేత్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ తరహాలోనే వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. భైంసాలో నిర్మించతలపెట్టిన శివాజీ విగ్రహ నిర్మాణం కోసం తవ్విన గుంతను పూడ్చి వేయించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విషయాలన్నింటిపై కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ జాబీర్ అహ్మద్

● నిబంధనల ప్రకారమే..

మున్సిపల్ మాజీచైర్మన్ జాబీర్ అహ్మద్ చేసిన ఆరోపణలపై శనివారం విలేకరులు జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వివరణ కోరగా స్పందించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు మున్సిపాల్టీ షాపింగ్ కాంప్లెక్స్ స్థలంపై విచారణ చేపడుతున్నామన్నారు. ఎవరికి కేటాయించాలనేది విచారణ తదుపరి కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్‌ను వివరణ కోరగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేందుకు గాను ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కనులపండువగా బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ వేడుకలు కన్నులపండువగా కొనసాగాయి. విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయురాళ్లు సంప్రదాయ దుస్తుల్లో వేడుకలకు హాజరై బతుకమ్మలను రంగురంగుల పూలతో శోభాయామానంగా అలంకరించారు. దీంతో ఆయా పాఠశాలల ప్రాంగణాలు పూల సువాసనలతో, బతుకమ్మ ఆట పాటలతో కళకళలాడాయి. (న్యూస్‌నెట్‌వర్క్)



భైంసాలో బతుకమ్మలతో వెలుతున్న శ్రీగౌతమి హైస్కూల్ ఉపాధ్యాయులు



సారంగాపూర్‌లో బతుకమ్మ పాటకు నృత్యాలు చేస్తున్న విద్యారులు



ఖానాపూర్ బతుకమ్మ వేడుకలు



వశిష్ట హైస్కూల్‌లో బతుకమ్మతో పాఠశాల ప్రిన్సిపాల్ గొల్లపల్లి మాధవి



ముథోల్‌లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో విద్యార్థులు



బతుకమ్మలతో విజయ్ విద్యార్థులు



సిద్దుల కుంట పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు



దిలావర్‌పూర్ కేజీబీవీలో బతుకమ్మ



కిర్గుల్(బి)లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు



కల్లూరు వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినిలు

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్

భైంసా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా దివ్యాంగుల సంక్షేమానికి బాధ్యతాయుతతో కృషి చేస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లు పేర్కొన్నారు. శనివారం భైంసాలోని బృందావన్ గార్డెన్స్‌లో సామాజిక అధికార్ శివిర్ పేరిటా ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, ఐసీడీఎస్ భైంసా ప్రాజెక్టు సీడీపీవో రాజశ్రీలతో కలిసి దివ్యాంగులకు వివిధ సహా య ఉపకరణాలు పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు రావుల రాము ఉన్నారు.



దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

దిలావర్‌పూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆర్థిక సహకారాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికస్వావలంబన సాధించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండల స్త్రీ శక్తి భవన్‌లో శనివారం స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు, వీవోఏల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ మహిళఆర్థిక శక్తిగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్డీవో గ్రామ సంఘాల పనితీరు, పుస్తక నిర్వహణ, బ్యాంక్ లింకేజీలను సమీక్షించారు. పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాలని మహిళలకు సూచించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ మానవహారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అరుణ రాణి, ఏపీఎం భోసు, ఏపీవో దివ్య రెడ్డి, ఏపీఎం రమేష్, టీఏ వెంకట రమణ పాల్గొన్నారు.



మహిళలతో కలిసి మానవహారంలో పాల్గొన్న డీఆర్డీవో

మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యత్వ నమోదు

సోన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాస్ సంస్థ ఆధ్వర్యంలో సిరి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యత్వ నమోదు సమావేశం సిద్దుల కుంట గ్రామంలో నిర్వహించారు. మహిళలు వ్యవసాయంలో ఆర్థిక అభివృద్ధి సాధించాలని, మధ్య దళారుల వద్ద మోసపోకుండా తాము పండించిన పంటలను సంస్థ ద్వారా అమ్మి వచ్చిన కమీషన్‌లో వాటా దారులుగా ఉండడమే కాకుండా బయట మార్కెట్ కన్నా తక్కువ ధరకు విత్తనాలు, ఎరువులు, మందులు, వ్యవసాయ అవసరాలు సంస్థ ద్వారా పొందవచ్చన్నారు. సోన్ మండల కేంద్రంలో తమ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని సంస్థ సీఈవో ప్రేమలత, కోఆర్డినేటర్ పద్మ పేర్కొన్నారు. తదనంతరం పలు రైతుల సభ్యత్వాన్ని తీసుకోవడం జరిగింది. మాదాపూర్ క్లస్టర్ ఏఈవో అశోక్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతులివ్వండి

- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్యే బొజ్జుపటేల్ వినతి

ఖానాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ నియోజకవర్గంలో అటవీ ప్రాంతంలో నివసించే ప్రజల రవాణాకష్టాలను తీర్చేందుకు ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కోరారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి సి.సువర్ణలను కలిసినట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడించారు. ఈ సందర్భంగా పెంబి, ఉట్నూర్ మండలాల్లో 6 ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి దాదాపు రూ. 17.92 కోట్ల నిధులు అవసరమవుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఐరన్ బ్రిడ్జిల కోసం మంత్రి సీతక్క నిధులను విడుదల చేశారని, అటవీ శాఖ నుంచి అనుమతులు త్వరగా మంజూరు చేసి ఐరన్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని కోరినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నిరుపేదల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని కొలాంగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. గూడులేని ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు దక్కుతుందన్నారు. మొదటివిడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారంతా ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అంతకుముందు ఖానాపూర్‌లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ నాయకులు శేషాద్రి, భీమ్ రావు, కడారి నరేష్, బండారి రవీందర్, బిక్కు నాయక్, ఎంపీడీవో రత్నాకర్ రావు, హౌసింగ్ ఏఈ ఖయ్యూమ్, తదితరులున్నారు.

మురికి నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని వినతి

పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల బొడ్డేని కుంటలో మురికి నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని ఆ కాలనీ వాసులంతా డిమాండ్ చేశారు. శనివారం పార్టీలకు అతీతంగా తరలివచ్చిన కాలనీనాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ కాలనీలో బొడ్డేని కుంట కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతినగర్ కాలనీకి చెందిన ఆయా పార్టీల నాయకులున్నారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగుదలపై దృష్టి

- మున్సిపల్ ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్

భైంసా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణపరిధిలో అధ్వాన్నస్థితికి చేరుకున్న పారిశుధ్య నిర్వహణ వ్యవస్థ మెరుగుదల కోసం గాను ప్రత్యేక దృష్టి సారించాలని భైంసా మున్సిపల్ అధికార యంత్రాంగానికి ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. శనివారం పలు ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు పారిశుధ్య సమస్యలను ప్రత్యేకాధికారి ఫైజాన్ అహ్మద్ దృష్టికి తీసుకవచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, టీపీవో అనురాధ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీష్ అహ్మద్‌లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చాలని సూచించారు. ఎక్కడ కూడా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

యాదిలో..

తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చేవాళ్లం..



- భగత్ సునిత, షెడ్యుల్డు కులాల అభివృద్ధి అధికారి, ఆదిలాబాద్

మా చిన్నతనంలో తీరొక్క పూలను సేకరించి బతుకమ్మను పేర్చేవాళ్లం. ఇంట్లో దొరికే పూలతో పాటు పంట పొలాలకు వెళ్లి స్వయంగా పూలను కోసి తీసుకొచ్చే వాళ్లం. ఇప్పటి మాదిరిగా డీజేలు, పెన్‌డ్రైవ్ పాటలు ఉండేవి కావు. చప్పట్లు కొడుతూ పల్లె పాటలను పాడుతు బతుకమ్మ ఆడేవాళ్లం. మా అమ్మ కళావతి పాడిన ఆవు పులి ఉయ్యాలో పాటను ఎక్కువగా పాడుకునే వారిమి. అప్పట్లో సంస్కృతి సాంప్రదాయాలు, భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పూజించే వాళ్లం.

పల్లె పాటలనే పాడుకునే వాళ్లం..



- డాక్టర్ సాధన, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్

బతుకమ్మ వేడుకలను ఎంతో సంబురంగా నిర్వహించుకునే వాళ్లం. ముఖ్యంగా బీర, గునుక, తంగేడు, బంతిపూలతో బతుకమ్మను పేర్చి అందంగా అలంకరించే వాళ్లం. ఉపవాసంతో బతుకమ్మను నిమజ్జనం చేసేవాళ్లం. నిత్యం సాయంత్రం వేళల్లో గ్రామంలో ఏర్పాటు చేసుకున్న బతుకమ్మ వద్ద మహిళలంతా కలిసి చప్పట్లతో పాటలు పాడేవాళ్లం. పంట చేన్లలోకి వెళ్లి రంగు రంగుల పూలను తీసుకొచ్చి బతుకమ్మను పేర్చేవాళ్లం.

అమ్మమ్మ ఇంటి వద్దే బతుకమ్మ ఆడేదాన్ని



బతుకమ్మ పండుగ అంటే చిన్నప్పటి నుంచే ఆసక్తి ఉండేది. కానీ మా నాన్నవాళ్ల ఇంటి దగ్గర బతుకమ్మ ఆడే వారు కాదు. నగరంలోని కోటగల్లిలో అమ్మమ్మవాళ్ల ఇంటి వద్ద బతుకమ్మ ఆడేదాన్ని, దసరా సెలవులు వచ్చాయంటే చాలు అమ్మ మ్మవాళ్ల ఇంటికి వెళ్లి అక్కడ కాలనీ వారితో బతుకమ్మ ఆడే దాన్ని. అమ్మమ్మ దగ్గరే బతుకమ్మ పేర్చడం, ఆడడం నేర్చుకు న్నాను. పెళ్లైన తర్వాత కాలనీలలో ఆడుతున్నాను.

- ప్రవంతిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి



పదోన్నతి పొందిన కాజల్‌సింగ్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

ఉట్నూర్, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన కాజల్‌సింగ్‌ను బీజేపీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. అడిషనల్ పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీని కలిసి పూలగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఉట్నూర్‌లో ఏఎస్పీగా నియామకమై అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందడం ఆనందంగా ఉందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బింగి వెంకటేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ డావులే బాలాజి, మాజీ ఎంపీటీసీ కందుకూరి రమేష్, మండలప్రధానకార్యదర్శి ఎంపీటీసీ సాల్గర్ రవీందర్, మాజీ ఎంపీటీసీ సీపతిలింగాగౌడ్, ఉట్నూర్ మండల జడ్పీటీసీ కన్వీనర్ సాడిగేరాజేశ్వర్, సీనియర్ నాయకులు దేవిదాస్, ఉగ్గే విజయ్, పందిరి భీమన్న, బాణవత్‌జితేందర్, పెంటకైలాస్‌లు పాల్గొన్నారు. ఇదిలాఉండగా టీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అడిషనల్ ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



అదనపు ఎస్పీ కాజల్‌సింగ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

దసరా సెలవులను సద్వినియోగించుకోవాలి

జైనథ్, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులు ఉన్నందున సెలవులను సద్వినియోగం చేసుకోవాలని జైనథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మద్దిలస్మన్న అన్నారు. శనివారం మండల కేంద్రమైన జైనథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అమ్మా ఆదర్శ పాఠశాల పోషకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

క్యాన్సర్ బాధితుడికి అరుదైన శస్త్రచికిత్స

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డాక్టర్ వివేక్ గ్యాస్ట్రో అండ్ లివర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. రెండేళ్లుగా అన్నవాహిక కాన్సర్‌తో చికిత్స పొందుతున్న పోచన్న అనే బాధితుడికి అన్నవాహిక మొత్తం మూసుకుపోవడంతో కనీసం మంచినీళ్లు తాగేందుకు కూడా ఇబ్బంది పడ్డాడని డాక్టర్ వివేక్ రాథోడ్ తెలిపారు. బాధితుడికి అడ్వాన్స్ పద్ధతిలో మెటల్ స్టంట్‌ను అమర్చడం జరిగిందని, దీని ద్వార రోగి ఆహారం తీసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోనే తొలిసారిగా అతి తక్కువ ఖర్చుతో అరుదైన శస్త్రచికిత్సను పూర్తి చేయడం గర్వంగా ఉందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎంపీడీవో

బోథ్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనుర్ గ్రామంలో శనివారం బూత్ ఎంపీడీవో రమేష్ శనివారం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పింఛన్లు మంజూరు చేయాలంటూ పంచాయతీ ముట్టడి

ఉట్నూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన వారికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలంటూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మండలంలోని హస్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. హస్నాపూర్‌కు చెందిన వృద్ధులు, వితంతువులు దివ్యాంగులు, ఒంటరి మహిళలు అర్హులైన వారందరికి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలంటూ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జీ అధ్యక్షుడు దాసరి రాంప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న వారికి పెన్షన్లు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన వారందరికి పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి విజయకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పరశురాం మాదిగ, గవాలే దీపక్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.



హస్నాపూర్ జీపీ ముందు నిరసన తెలిపి కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కారు కొనేద్దాం.. చలో

ఆదిలాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): షోరూం నిర్వాహకులు సైతం తగ్గిన రేట్లకు అనుగుణంగా బుకింగ్‌లను చే స్తూ ఈ నెల 22 తర్వాత డెలివరీ ఇచ్చేందుకు సిద్ధమవు తున్నా రు. పితృపక్షాలు ఉండటంతో మంచి రోజులు లేవన్న కారణంతో విని యోగదారులు సైతం నూతన వస్తువులను, వాహనాలను కొ నుగో లు చేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో ఎప్పుడూ వినియోగ దా రులతో కలకళలాడే షో రూంలు వెలవెలబోతున్నాయి. జీఎస్టీ స్లాబ్ లు రెండే ఉండటంతో కొత్త వస్తువులపై రేట్లు తగ్గే అవ కాశాలున్న ట్లు వార్తలు వస్తున్నాయి. ము ఖ్యంగా రూ.15లక్షలలోపు రేటు ఉన్న కార్లు, ద్విచక్రవాహనాలు ఇతరత్ర ఎలక్ట్రానిక్ వస్తు వుల రేట్లు భారీగా తగ్గే అవకాశాలు ఉండటంతో వినియోగదారులు ఈ నెల 22 తర్వాతే మార్కెట్‌కు వెళ్దామనుకుంటున్నారు.

కార్ల షోరూంలకు పెరిగిన బుకింగ్‌లు

కొత్త జీఎస్టీ స్లాబ్ రేట్లతో కార్ల ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి. సుజికి, టాటా, హుందాయి, మారుతి నెక్సాతో పాటు ఇతర కంపెనీల కార్ల ధరలు కొత్త జీఎస్టీ స్లాబ్ రేట్లతో తగ్గుముఖం పట్టాయి. మోడల్‌ను బట్టి గతంలో కంటే సుమారు రూ.40 నుంచి 60వేల వరకు కార్ల ధరలు తగ్గుతున్నాయి. దీంతో చిన్నకార్లు కొనాలనుకునే వినియోగదారులు నూతన కార్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల విషయంలో స్పష్టత కరవు

దసరా, దీపావళి సందర్భంగా ఎలక్ట్రానిక్ వస్తువులకు మంచి గిరాకీ ఉంటుంది. ఇప్పుడు కేంద్రం కొత్త జీఎస్టీ స్లాబ్‌లను అమలు చేయ నుండటంతో ఎలక్ట్రానిక్ వస్తువుల విషయంలో ధరలు తగ్గుతాయా లేదా అన్న విషయంలో స్పష్టత రావాల్సి ఉండటంతో వినియోగదారులు కొనడం లేదు. దీంతో మార్కెట్‌లోని ఎలక్ట్రానిక్ షోరూంలు వెలవెల బోతున్నాయి. టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, వాషింగ్ మిషన్‌లు కొనుగోలు చేసే విని యోగదారులు ఈ నెల 22 తర్వాత కొందామని వేచిచూస్తున్నారు. దసరా, దీపావళి పండగ సమయాలలో ఆఫర్లు ఉండే అవకాశం ఉండటంతో వినియోగదారులు ఆ సమయం వరకు వేచి చూస్తున్నారు.

ప్రతిభ అవార్డుకు ఎంపికైన మండల వాసి



అవార్డు అందుకుంటున్న డాక్టర్ అమృత్‌కుమార్

నేరడిగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నాంపల్లి హైదరాబాదులో జరిగినటువంటి మార్ట్ ఆర్గనైజేషన్ 28వ వార్షికోత్సవ సందర్భంగా ప్రపంచ శాంతి ప్రతిభ అవార్డును మండలవాసి డాక్టర్ అమృత్ కుమార్‌ని ఎంపిక చేసిన సందర్భంగా మండల వ్యాప్తంగా ప్రజలు అభినందించారు. గత కొంతకాలంగా సామాజిక కార్యక్రమాల పట్ల చట్టాలపై క్యాన్సర్, డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టినందుకు మార్ట్ ఆర్గనైజేషన్ వారు జాతీయ శాంతి ప్రతిభా అవార్డును అందించారు.

ఆపదలో ఉన్న వారికి అండగా సీఎంఆర్‌ఎఫ్

నేరడిగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలానికి చెందిన చెందిన గడ్డం లావణ్యకు చెందిన రూ.60 వేల విలువ గల సీఎం సహాయనిధి చెక్కును శనివారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో లబ్ధిదారునికి అందించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఇందులో తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న గజేందర్

గుట్టుగా మత్తు దందా

(5వ పేజీ తరువాయి)

మార్గాల గుండా తరలించి విక్రయిస్తున్నారు.

బరి తెగిస్తున్న స్మగ్లర్లు..

గంజాయికి ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉండడంతో స్మగ్లర్లు ఎంతకైనా తెగిస్తున్నారు. రాత్రి వేళల్లో గంజాయిని తరలిస్తూ పట్టుబడుతున్నసమయంలో దాడులకు సైతం సిద్ధమవుతున్నారు. జిల్లా మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారి గుండా రహస్యంగా అదునుచూసి సరిహద్దులు దాటిస్తున్నారు. జిల్లాలో గుట్టు చప్పుడుకాకుండా సాగు చేస్తున్న గంజాయిని సేకరిస్తూ పెద్ద మొత్తంలో సరిహద్దులు దాటిస్తూ అమ్మేసుకుంటున్నారు. అమాయకుల వద్ద కిలో రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న రాష్ట్రాల్లో కిలో రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. గంజాయి దందాతో లక్షల రూపాయలు జేబులో వేసుకుంటున్నారు. పొరుగున ఉన్న మహారాష్ట్రకు అడ్డదారుల్లో తరలిస్తు అమ్మేసుకుంటున్నారు. జిల్లా మీదుగానే గంజాయి దందా సాగుతున్న సరిహద్దు చెక్‌పోస్టుల్లో అడ్డుకట్ట పడడం లేదు.ప్రధానంగా జాతీయ రహదారి గుండా సాగుతున్న గంజాయి దందా పై నిఘా కొరవడుతుందన్న విమర్శలు వస్తున్నాయి.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించండి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసిన బసవేశ్వర్ సమాజ్ సభ్యులు

నేరడిగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గుడిహత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామస్థులు శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొల్హారి గ్రామంలో బసవరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల్ గౌడ్ ఉన్నారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నాయకులు

నార్నూర్ సీఐకి బెస్ట్ అవార్డు

ఆదిలాబాద్ (నార్నూర్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏజన్సీ గిరిజన ప్రాంత శాంతి భద్రతలతో పాటు యువత చెడు అలవాట్లు బానిసలు కాకుండా ఎప్పటికీ అప్పుడు మంచి సలహా సూచనలు ఇస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కాకుండా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ ఉమ్మడి నార్నూర్ మండలానికి శాంతి వాతావరణాన్ని కల్పించడం నేను ఉన్న అనే భరోసా ఇచ్చినా సీఐ పి.ప్రభాకర్‌కు బెస్ట్ అవార్డును ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అందించారు.

కొలాం ప్రజలు కి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

ఆదిలాబాద్ (నార్నూర్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏ జెన్సీ గిరిజన ప్రాంత నార్నూర్ మండల ఎంపల్లి కొలం గూడ గ్రామానికి చెందిన ఏడుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారికి ధ్రువపత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి రాథోడ్ దినేష్ అందించారు.

క్షతగాత్రుడికి ఎమెల్యే పరామర్శ



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన మన్నూరి నారాయణ్ రెండు రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో గాయపడి తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్ పట్టణంలో గల యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతాగాత్రున్ని శనివారం రాత్రి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడినట్లు బిజేపీ నాయకులు తెలిపారు. ఈయన వెంట నాయకులు రాంశంకర్‌రెడ్డి, టీకారం గణేష్, రాం, గంగాధర్‌లున్నారు.

ఉరివేసుకొని ఒకరి మృతి

సారంగాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాయినగర్ తండాకు చెందిన రాథోడ్‌లాలు (36) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి ఉరివేసుకొని మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది గ్రామ శివారులో గల చెట్టుకు ఉరి వేసుకొని ఈ ఆఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

నిలిచి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి దుర్మరణం

దిలావర్‌పూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నిలిచి ఉన్న లారీని ఢీకొని న్యూ లోలం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్(40) దుర్మరణం పాలయ్యాడు. హుస్సేన్ తన ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుంచి తిరిగి స్వగ్రామం న్యూలోలం వస్తుండగా సిర్గాపూర్ గ్రామ శివారులో 61వ నేషనల్ హైవేపై పక్కన ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. తలకుబలమైన గాయాలు కావడంతో స్థానికులు హుస్సేన్‌ను నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.మృతుడు హుస్సేన్ భార్య షేక్ చోటి బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

లో-వోల్టేజ్ విద్యుత్ సమస్యకు పరిష్కారం

కడెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెంలో విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను మండల విద్యుత్ శాఖ అధికారి రామ్‌సింగ్‌కు విన్నవించారు. స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారంగా గ్రామంలో 25 కేవీ సామర్థ్యం గల కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో లో వోల్టేజ్ సమస్య తీరిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అడెల్లి మహాపోచమ్మ జాతర పోస్టర్లు విడుదల

సారంగాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ దేవాలయం జాతర పోస్టర్లను శనివారం ఆలయ చైర్మన్ భోజాగౌడ్, ఇన్‌చార్జి ఈవో రమేష్‌లతో పాటు పాలక మండలి సభ్యులు విడుదల చేశారు. సమావేశంలో సీఐ కృష్ణ ఎస్సై శ్రీకాంత్‌లతో పాటు ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఆర్టీఐ సామాజిక కార్యకర్తల ఫోరం సదస్సు

ముథోల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సమాచార హక్కు చట్టం 2005పై ఆర్టీఐ సామాజిక కార్యకర్తల ఫోరం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీఐ సామాజిక కార్యకర్తల ఫోరం తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సయ్యద్ కలీం మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చట్టాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

పెన్షన్ పెంచాలని డిమాండ్

నర్సాపూర్(జి), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) మండలంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెన్షన్ల పెంపును డిమాండ్ చేస్తూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి కైలాష్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుత పెన్షన్లు జీవనానికి ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేదం గ్లోబల్ హైస్కూల్‌లో తస్మా డిస్ట్రిక్ట్ జనరల్ బాడీ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. తస్మా స్టేట్ ప్రెసిడెంట్ సాదుల మధుసూదన్ అధ్యక్షతన తస్మా జనరల్ బాడీ స్టేట్ సెక్రటరీ అయిన రమేష్ రావు, తస్మా స్టేట్ ట్రెజరర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్, అన్ని స్కూల్‌ల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో తస్మా జిల్లా అధ్యక్షుడిగా వేదం శ్రీనివాస్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సోన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామంలో నాబార్డ్ సంస్థ సౌజన్యంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. రైతులు, మహిళలు, మహిళా సంఘాలు ప్రైవేట్ రుణ సంస్థలను ఆశ్రయించకుండా బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు పొందవచ్చని, ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్‌లు, టర్మ్ పాలసీలు కలిగి ఉండడం ద్వారా కుటుంబానికి ఆర్థిక భరోసా ఉండడంతో పాటు ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని బ్యాంక్‌లో పొదుపు చేసుకోవాలని, ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. కార్యక్రమంలో ఏఈవో అశోక్ కుమార్, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. పట్టణంలోని టౌన్ వన్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఓల్డ్ బస్టాండ్, బుధవార్‌పేట్, నగరేశ్వరవాడ, బాగులవాడ, కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో, జోహ్రనగర్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, ప్రియదర్శిని నగర్, ఏరియా ఆసుపత్రి, బర్కత్‌పురా, డాక్టర్స్ లైన్, కస్బా కమల్ టాకీస్, రోయల్ బల్డింగ్, చింతకుంటవాడ, గాంధీ చౌక్, ద్యాడవాడ, పింజారి గుట్ట, చిక్కడపల్లి, ఇంద్రానగర్, గొల్లపేట్, శాస్త్రినగర్, చైన్‌గేట్, మదీనా కాలనీ, ఇరిగేషన్ ఆఫీస్, సాగర్ కాలనీ, భాగ్యనగర్, రామ్‌నగర్, ఆస్రా కాలనీ, ఎన్టీఆర్ మార్గ్, బోయవాడ, నట్‌రాజ్ నగర్, సబ్ జైలు, శరత్ మహల్ మొదలైన ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. వినియోగదారులు సహకరించగలరని తెలిపారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ప్రతిభ



వివిధ కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులు

భైంసా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జేకేఏఐ ఆఫ్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో కరాటే కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పరీక్షల పోటీలు జరిగాయి. ఇందులో పాఠశాలకు చెందిన 50 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. జేకేఏఐ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ కరాటే రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎగ్జామినార్ సెన్సాయ్ తేజేందర్ సింగ్ బాటియా, జిల్లా కరాటే అధ్యక్షులు కొండ శ్రీకాంత్ నేతృత్వంలో గ్రేడింగ్ పరీక్షలు జరిగాయి. ఇందులో పాఠశాల విద్యార్థినీలు ప్రతిభను చాటుకొని జూనియర్ రెడ్, ఎల్లో, గ్రీన్ బెల్ట్‌తో పాటు సర్టిఫికేట్‌లను అందుకున్నారు. ఇందులో భైంసా మార్షల్ ఆర్ట్స్ సీనియర్ శిక్షకులు శ్రీరాముల సాయికృష్ణ, మాస్టర్స్ జ్ఞానతేజ, లింగం, ప్రతిక్ష, అనన్య, శివరాజ్ గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం అవగాహన

దిలావర్‌పూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విపత్తుల నుంచి మనల్ని మన రక్షించుకునే పద్ధతులపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 16వ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ సబ్ ఇన్స్‌పెక్టర్ జితేందర్ సింగ్ నేతృత్వంలో బృందం శనివారం తమని తాము రక్షించుకోవడంతో పాటు పక్కవారిని ఏవిధంగా రక్షించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాంపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్

నర్సాపూర్ (జి), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్ గ్రామంలో శనివారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రామీణ సీఐ కృష్ణ, ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన 74 బైక్‌లు, 2 ఆటోలు, 1 కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా సీఐ కృష్ణ గ్రామస్థులకు పలు ముఖ్యమైన విషయాలపై అవగాహన కల్పించారు. నేరాల నివారణ, నియంత్రణ కోసం సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకత, రోడ్డు భద్రత గురించి కూడా ఆయన వివరించారు. రాబోయే దుర్గా నవరాత్రి ఉత్సవాలను శాంతి యుతంగా జరుపుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్థులను కోరారు. సహకరించిన ప్రతి ఒక్కరికి పోలీసులు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

‘కస్తూర్బా గాంధీ నాన్‌టీచింగ్ వర్కర్స్‌పై మొండివైఖరి వీడాలి’

సోన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సోన్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో శనివారం కరపత్రాలు విడుదల చేస్తూ, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. రాజన్న మాట్లాడారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పని చేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్స్ వేతనాలను పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుఎ విఫలం చెందాయని తీవ్రంగా మండిపడ్డారు. వెట్టి చాకిరి చేయించుకుంటే శ్రమదోపిడీకి గురి చేసున్నారని వారు ప్రభుత్వాలను హెచ్చరించారు. సెప్టెంబరు 22న కేజీబీవీ వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వర్కర్లకు నైట్ డ్యూటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కే. లక్ష్మి, కేజీబీవీ సోన్, నాన్ టీచింగ్ సిబ్బంది శిరీష, వినోద, పార్వతి పాల్గొన్నారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విగ్రహాలు ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని సారంగాపూర్ మండల కుర్మే సంఘం నాయకులు అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కుర్మే సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలో గల రాయపూర్‌కాండ్లీ లో బీరప్ప విగ్రహన్ని ధ్వంసం చేసిన గుర్తుతెలియని దుండగులను పట్టుకొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

విద్యార్థులకు వైద్యం, ఆరోగ్యంపై అవగాహన

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో శనివారం ఆయుష్ యునాని వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పిల్లలకు యోగా వలన లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బద్రి ప్రవీణ్, నషా ముక్త్ అభియాన్ మేనేజర్ శ్రీనివాస్, కరస్పాండెంట్ నర్సారెడ్డి, అధ్యాపకులు కుంటాల శ్రీనివాస్, శివ, చంద్రవాస్, యోగా టీచర్లు ప్రదీప్, పవిత్ర, నవీన్ పాల్గొన్నారు.

మైనర్‌లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు

తానూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మైనర్‌లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ఎస్సై షేక్ జుబేర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రం తానూర్‌లో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మైనర్‌లు బైక్‌నడుపుతుండగా బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్‌ల చేత వాహనాలను నడపడం వల్ల సంభవించే ప్రమాదాలు, అలాటే చట్టపరంగా తల్లిదండ్రులు ఎదుర్కొనే జాబితా పరిణామాలు వారికి వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

సోన్ : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సోన్ ఎస్సై తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని న్యూ వెల్మల్‌లో నిర్వహించిన వాహన తనిఖీలలో మైనర్లు డ్రైవింగ్ చేస్తూ నలుగురు పడినట్లు తెలిపారు.

కుంటాల : మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాలలలో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్లు వాహనాలు నడపగా వారి తల్లిదండ్రులను పిలిపించి మరోమారు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈయన వెంట కానిస్టేబుల్ మనోహర్ తదితరులు ఉన్నారు.

బ్యాంకుల్లో భద్రత చర్యలు తీసుకోవాలి

● భైంసా టౌన్ సీఐ గోపినాథ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టౌన్ సీఐ గోపినాథ్

భైంసా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకర్లు తమ తమ బ్యాంకులలో పటిష్ట భద్రతా చర్యలను ఏర్పాటు చేయాలని భైంసా టౌన్ సీఐ గోపినాథ్ సూచించారు. ఇటీవల వివిధ ప్రాంతాల్లోని బ్యాంకులలో చోటు చేసుకుంటున్న చోరీ ఘటనల నేపథ్యంలో శనివారం పట్టణ పరిధిలోని పలు బ్యాంకులను సందర్శించి భద్రతా చర్యలను సమీక్షించారు. ఆయా బ్యాంకుల మేనేజర్లు, సిబ్బందితో సమావేశమై ప్రస్తుతం అమలులో ఉన్న భద్రతా చర్యలను విశ్లేషించారు. సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థ, భద్రతా సిబ్బంది విధులు వంటి అంశాలను స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు ఉన్నా వెంటనే సరి చేసుకోవాలన్నారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో టౌన్ సీఐ గోపినాథ్, ఎస్సై నవనీత్ రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను పట్టుకున్నారు. వారు నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మైనర్లకు పలు అంశాలపై కౌన్సిలింగ్ నిర్వహించారు.

సంస్కృతి, చైతన్యాన్ని చాటిచెబుతాం



అధికారికంగా నిర్వహించే బతుకమ్మ పండుగ సంబరాల్లో పొదుపు సంఘాల మహిళలందరూ పాల్గొంటారు. కృత్రిమ పూలతో కాకుండా సహజపూలతో వేడుకలను నిర్వహిస్తాం. ఇప్పటికే పల్లె ప్రాంతాల్లో గునుగు, ఇతర పూలను సేకరించే కార్యక్రమం మొదలుపెట్టాం. 9రోజులపాటు వేడుకలను అట్టహాసంగా నిర్వహించి, మహిళల సంస్కృతి, సంప్రదాయా లతో పాటు చైతన్యాన్ని చాటి చెప్పనున్నాం.

- విజయలక్ష్మి, డీఆర్‌డీవో, నిర్మల్ జిల్లా

అమావాస్య నుంచి 12 రోజులు బతుకమ్మ ఆడేవాళ్లం



బతుకమ్మ అంటే ప్రకృతిని ఆరాధించే పండగ. చిన్నప్పుడు స్నేహితులతో కలిసి ఏటా అమావాస్య రోజు నుంచే బతుకమ్మను ఆడేవాళ్లం. ఇంటి ముందట పెద్ద గుంత తవ్వి చుట్టూ గద్దెలు కట్టి రాత్రివేళలో 12 రోజుల పాటు బతుకమ్మ ఆడేవాళ్లం. దసరా రోజు గునుగు, తంగేడు తదితర పూలను సేకరించి బతుకమ్మను పేర్చి సంబరాలు చేసుకునేవాళ్లం. ఇప్పటికీ మా ఇంటి వద్ద బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటా. **- శ్రీలత, ముధోల్ తహసీల్దార్**

పెద్దల పాటలకు మైమరిచిపోయేవాళ్లం



మా చిన్నతనంలో బతుకమ్మ వేడుకలలో చప్పట్లు కొడుతూ.. పాటలు పాడుతూ.. ఎంతో ఉల్లాసంగా గడిపేవాళ్లం. రోజూ సాయంత్రం ఆడే బతుకమ్మ కోసం ఉదయం నుంచే తీరొక్క పూలను సేకరించడం ఆనందాన్ని కలిగించేది. సంస్కృతి, సంప్రదాయాలను బతుకమ్మ పాటల రూపంలో నాటి పెద్దలు పాడితే వాటిని విని మైమరిచిపోయే వాళ్లం. నేడు ఎక్కడ చూసినా డీజే శబ్దాలే వినిపిస్తున్నాయి.

- శ్రీలత, ఐసీడీఎస్ సీడీపీవో, ఖానాపూర్



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌టౌన్,సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, సమయాన్ని వృథా చేయకుండా సరైన రీతిలో వినియోగించుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-1లో పీఎంశ్రీ పథకం కింద 2 అదనపు తరగతుల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముందుగా అతిథులకు విద్యార్థులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విద్యార్థులకు సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాథమిక, ఉన్నతవిద్యలో సరైన ప్రమాణలు పాటించినప్పుడే ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయన్నారు. భారతదేశంలోని పురాతన విద్యావ్యవస్థపై వివిధ దేశాలు అధ్యాయనం చేస్తున్నాయని, చదువులతల్లి సరస్వతి ఫొటోలు పెట్టి పూజించడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.

అమ్మో.. పులి

- బోథ్ అడవుల్లోకి మళ్లీ రాక
- జంతువులపై దాడులు
- భయాందోళనలో ప్రజలు

బోథ్,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): బోథ్ అడవుల్లోకి మళ్లీ పులి వచ్చింది. మూడు నెలలుగా పులి ఇదే ప్రాంతంలో మకాం వేసినట్లు అటవీ అధికారులు గుర్తించారు. దానిని కాపాడేందుకు నిఘా పెంచారు.

● జంతువులపై దాడి

బోథ్ రేంజ్ పరిధిలోని సోనాల పంచా యతీ పరిధిలోని అడవుల్లో పులి సంచరిస్తు ంది. మూడు నెలల క్రితం కనిపించిన పులి 2రోజులుగా వజ్జర్ అడవులలో సంచరిస్తుందని ఆయా గ్రా



అటవీప్రాంతంలో పెద్దపులి అడుగులు

మాల ప్రజలు పేర్కొంటున్నారు. మూడు రోజుల క్రితం వజ్జర్ అడవుల్లో మేత కోసం వెళ్లిన ఓ పశువుపై పులి దాడి చేసింది. ఈ విషయాన్ని అటవీ అధికారులు సైతం ధ్రువీకరించారు. పులిసంచారంతో అటవీ ప్రాంతంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● పులికి హాని తలపెట్టొద్దు,



పులిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది. దానికి ఎలాంటి హాని తలపెట్టొద్దు. రైతులు గుంపులుగా చేన్లకు వెళ్లాలి. ఒంటరిగా వెళ్లొద్దు. మా సిబ్బంది సైతం పులిని కాపాడుతున్నారు.

- ప్రణయ్, బోథ్ రేంజ్ అధికారి

నాణ్యమైన విద్య అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీటీడబ్ల్యూ అంబాజీ

గుడిహత్నూర్ , సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్రి బి ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం డీడీటీడబ్ల్యూ అంబాజి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. వసతిగృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. 10వ తరగతికి సంబంధించిన సిలబస్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మ వేడుకలు ప్రారంభించారు. ఆయన వెంట హెచ్ఎం భోజన్న, ఉపాధ్యాయులు మోహన్, ఆడే రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉన్నత ఆశయాలతోనే ఆరోగ్య పాఠశాల



విద్యార్థులు, టీచర్లతో బతుకమ్మ ఆడుతున్న అడిషనల్ ఎస్పీ

ఉట్నూర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఆర్యోగ పాఠశాల కార్యక్రమం ఉన్నత ఆశయాలతో కొనసాగించాలని అడిషనల్ ఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు. శనివారం ఉట్నూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆర్యోగ పాఠశాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఆర్యోగంగా ఉంటేనే టీచర్లు చెప్పే విషయాలను శ్రద్ధతో విని చక్కగా చదువుకోగలుగుతారన్నారు. కష్టపడి బాగా చదువుకొని ఉన్నత సర్వీసులో చేరాలని సూచించారు. పాఠశాలలో కానీ బయటకాని ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే తల్లి దండ్రులకు లేదా పోలీసులకు తెలపాలన్నారు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ల విషయాలను టీచర్ల ద్వారా తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. ఎవరైనా బ్యాడ్ టచ్ చేసినట్లయితే పోలీసు శాఖలో ఉన్న షీ టీంకు తెలపాలని సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో దసరా సెలవులు సందర్భంగా హెచ్ఎం శీతల్ చౌహాన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మకు అడిషనల్ ఎస్పీ పూజలు చేశారు. అనంతరం టీచర్ల కోరిక మేరకు విద్యార్థులు టీచర్లతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్‌రావు,మండల విద్యాధికారి ఆశన్న, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జయ, టీచర్లు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై పాదచారులకు ఇబ్బంది లేకుండా చూడాలి

● మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై పాదాచారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు బోయవాడ ప్రజలు, హనుమాన్, గురుద్వార్ భక్తులు తెలిపారు. పట్టణంలోని బోయవాడ హనుమాన్ టెంపుల్ పక్కన గురుద్వార్ వెళ్లే దారిలో కమర్షియల్ చేస్తూ చిన్న టేలా వేసుకొని రోడ్డుపైన వెల్డింగ్ చేస్తూ భక్తులకు ఇబ్బంది చేయడం జరుగుతుందని వారికి, వారి యజమానులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఫుట్ పాత్ ఆక్రమించుకొని కూడా రేకుల షెడ్డు వాటిపైనే వారి పనులు చేయడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అక్కడ ఉన్న రేసులు, ముందర ఉన్న టేలాను తీసి భక్తులకు, పాదాచారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

అంకోలి వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సర్ఫారాజ్

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ఆసుపత్రిలో స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా రిమ్స్ వైద్యులు శిబిరం నిర్వహించారు. మారుముల గ్రామాల్లోని వారికి సైతం నాణ్యమైన వైద్యాన్ని అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని డాక్టర్ సర్ఫారాజ్ తెలిపారు. వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని, ఈ వైద్య శిబిరంలో స్త్రీ వైద్య నిపుణురాలు వావిల, పిల్లల డాక్టర్ సిద్దార్థ, కంటివైద్య నిపుణురాలు ప్రశాంతి, మానసిక వైద్య నిపుణుడు ఓంప్రకాష్, ఆర్‌బీఎస్‌కే వైద్యుడు డాక్టర్ నరేందర్, సానిక డాక్టర్ సర్ఫారాజ్ సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో 56 మందికి సాధారణ పరీక్షలు, 42మందికి గైనకాలజీ, 14 మందికి కంటి పరీక్షలు, 21మంది చిన్నారులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు డా.నరేందర్ రాథోడ్, డా.మనోహర్, డా.శ్రీధర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో కేజీబీవీ విద్యార్థుల సత్తా



కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులు, పోటీల నిర్వాహకులు

భైంసా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జేకేఏఐ ఆఫ్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పరీక్షల పోటీలు జరిగాయి. ఇందులో కేజీబీవీకి చెందిన 50మందికి పైగా విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. తెలంగాణ కరాటే రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎగ్జామినార్ సెన్సాయ్ తేజేంధర్‌సింగ్ బాటియా, జిల్లా కరాటే అధ్యక్షుడు శ్రీకాంత్ నేతృత్వంలో పరీక్షలు జరిగాయి. విద్యార్థినులు ప్రతిభను చాటుకొని జూనియర్ రెడ్, ఎల్లో, గ్రీన్ బెల్ట్‌తో పాటు సర్టిఫికేట్‌లను అందుకున్నారు. తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించారని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి జ్యోతి తెలిపారు. ఇద్దరు పూర్వ విద్యార్థినులు మార్షల్ ఆర్ట్స్ కరాటే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించినట్లుగా తెలిపారు. ఇందులో భైంసా మార్షల్ ఆర్ట్స్ సీనియర్ శిక్షకులు శ్రీరాముల సాయికృష్ణ, మాస్టర్స్ జ్ఞానతేజ, లింగం, ప్రతిక్ష, అనన్య, శివరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దబంతి పూసేనే.. బతుకమ్మ మురిసేలా



గిర్నూర్ గ్రామ సమీపంలో బంతి పూలవనం

బజార్‌హత్నూర్, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): అతివలు మెచ్చే బతుకమ్మ పండగరానే వచ్చింది. పూల పండుగకు తోటలు సిద్ధమయ్యాయి. పూలను తెంపి బతుకమ్మలు పేర్చడమే ఆలస్యం. బజార్‌హత్నూర్‌కు చెందిన కానిందే వినోద్ గిర్నూర్ సమీపంలోని తన 2 ఎకరాలలో ఇచ్చోడ-సోనాల రహదారి పక్కనే బంతిపూలు సాగుచేశారు. 2 నెలల కింద నాటిన ఈ తోటలో ఎర్ర, పసుపు బంతిపూలు విరబూసాయి. రహదారి వెంట వెళ్తున్న ప్రయాణికులకు బంతిపూలు కనువిందు చేస్తున్నాయి. బతుకమ్మ, దీపావళి, దసరా పండగల సీజన్ కావడంతో పూలకు డిమాండ్ పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో..!



న్యూ సాంగ్విలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

మామడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మామడ మండలంలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విద్యుత్‌లైన్లను చూస్తూ ఉంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నామని చెబుతున్నారు. పరి మండల్‌లో 30ఏళ్ల కిందట ఏర్పాటుచేసిన విద్యుత్ లైన్లు కాలం చెల్లడంతో తుప్పుపట్టి తెగి పడిపోతున్నాయి. దీనిపై విద్యుత్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పెడచెవిన పెడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇదివరకు వైర్లు తెగిపడి ఇద్దరు ప్రాణాలుకోల్పోయారని, ఎన్నో మూగజీవాలు మృత్యువాత పడ్డాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత విద్యుత్ లైన్లస్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

సెలవులొచ్చాయ్..!



కుటుంబ సభ్యులతో సంతోషంగా వెళ్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా పండగకు విద్యాశాఖ 15 రోజులు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు హుషారుగా ఇళ్లకు బయలుదేరారు. పట్టణంలోని వసతిగృహాల్లో విద్యార్థులను తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు రావడంతో సందడి కనిపించింది. 15 రోజులపాటు సెలవులు ఉండడంతో తమ వస్తువులను వెంట పెట్టుకుని ఇళ్లకు వెళ్లారు. దీంతో పట్టణంలోని బస్టాండ్‌లో రద్దీ కనిపించింది. పట్టణమంతా కొనుగోలుదారులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడింది.

బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్వాడా

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా పక్వాడా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం స్థానిక ప్రగతిశీలత విద్యాలయంలో బీజేపీ మహిళా మోర్చా నేతృత్వంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ఆత్మనిర్భరభారత్, ఆపరేషన్ సిందూర్ అంశాలపై పోటీలు జరపగా.. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు బీజేపీ సీనియర్ నేత నివేదిత తెలిపారు. కార్యక్రమంలో మహిళా నాయకులు సుమన్‌బాయి, పద్మగౌడ్, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ఆదిలాబాద్‌టౌన్,సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. జూనియర్లకు సీనియర్‌లు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థినులు సినీగీతాలకు నృత్యాలు చేస్తూ సంతోషంగా గడిపారు. తోటి విద్యార్థినులు కేరింతలు, చప్పట్లతో వారిని ఉత్సాహపరచడంతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమ ముఖ్యఅతిథిగా డీఐఈవో గణేష్ జాదవ్ హాజరై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూరజ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమని, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని డీఐఈవో గణేష్ జాదవ్ సూచించారు.

ప్రమాదకరంగా పిల్లర్ గుంతలు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం పక్కన రోడ్డును, అవాసాలను ఆనుకొని ఉన్న పిల్లర్ గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వెలిబుచ్చారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం గుంతలు తవ్వి పిల్లర్లు పోశారని, గుంతలు పూడ్చకపోవడంతో అందులో నీరు నిండి చిన్న పిల్లలకు ప్రమాదకరంగా తయారైందని చెప్పారు. ఇంతకు ముందు ఒక బాలుడు సైకిల్‌పై వెళ్తూ గుంతలో పడి గాయాలపాలయ్యాడని, అధికారులు స్పందించి ఈ గుంతలను పూడ్చటం గాని, ప్రమాద నివారణ కోసం చర్యలు చేపట్టాలని కోరారు.



లక్ష్మణచాంద అంబేద్కర్ భవనం వద్ద గుంతలు

చర్యలు తీసుకుంటాం...

ఈ విషయం మా దృష్టికి వచ్చింది. ప్రమాద నివారణ కోసం సంబంధిత పంచాయతీ ద్వారా గుంతలను పూడ్చి వేయిస్తాం. లేదంటే ప్రమాద నివారణకు ఇతర చర్యలు చేపడతాం

- ఎంపీడీవో రాధా రాథోడ్



వేదం పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



ఉట్నూర్ పులాజీబాబా పాఠశాలలో..



ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



బాలుర పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు

బతుకమ్మ.. బతుకమ్మ వలలో..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు జిల్లావ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. దసరా పండగకు ముందు వచ్చే అమావాస్య నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలను జిల్లాలో వైభవంగా జరపనున్నారు. మహిళలంతా ఒక్క చోట చేరి... రంగు రంగుల పూలతో బతుకమ్మలను ముస్తాబు చేసి సంప్రదాయ రీతిలో వేడుకలను జరుపుకోనున్నారు. ఇదిలా ఉంటే పలు పాఠశాలలు, కళాశాలల్లోనూ బతుకమ్మ వేడుకలను సంబరంగా నిర్వహించారు. దసరా సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా విద్యాసంస్థల్లో వేడుకలను అట్టహాసంగా జరిపారు. విద్యార్థులకు పండగ విశిష్టతను తెలియజేశారు. **- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్**



నార్నూర్ మోడల్ స్కూల్‌లో సంబరాలు



గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌లో బతుకమ్మలతో విద్యార్థినిలు, ఉపాధ్యాయులు



డైట్ కళాశాలలో సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



ఆదిలాబాద్‌లోని విద్యార్థి కళాశాలలో బతుకమ్మఆడుతున్న విద్యార్థినులు



బతుకమ్మలతో ఉట్నూర్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయినులు



బేలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



ఆదిలాబాద్‌లో బతుకమ్మలను తీసుకువస్తున్న విద్యార్థినులు



బుగ్గారాంలో బతుకమ్మ సంబరాలు



కారు కొనేద్దాం చలో..

- జీఎస్టీ స్లాబ్‌ల మార్పుతో పెరిగిన బుకింగ్స్
- 22 తర్వాత కొనేందుకు కస్టమర్లు సిద్ధం
- ఎలక్ట్రానిక్స్ వస్తువుల విషయంలో స్తబ్ధత
- మార్కెట్‌లో క్లియరెన్స్ సేల్స్

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించడంతో కార్లు, ఎలక్ట్రానిక్, ఇతర వస్తువుల రేట్లు భారీగా తగ్గనున్నాయి. దీంతో అందరూ తమకు నచ్చినవి కొనేందుకు సిద్ధమవుతున్నారు. తగ్గే ధరలు ఈ నెల 22 నుంచి అమల్లోకి వస్తుండటంతో అప్పుడే కొందామని, ఇప్పుడైతే బుకింగ్ చేసుకుందామని ఫిక్స్ పుతున్నారు. కొత్త స్లాబుల అమలయ్యాకే చూద్దామని, మార్కెట్‌కు వెళ్లకపోవడంతో వాహనాలు, ఎలక్ట్రానిక్, ఇతర వస్తువుల కొనుగోళ్లు తగ్గిపోయాయి.

6

బుకింగ్‌లు పెరిగాయి..

● వెంకటరమణ గుప్త, వరుణ్ మోటార్స్ జీఎం



కొత్త జీఎస్టీ స్లాబ్‌లతో కార్ల ధరలు భారీగా తగ్గాయి. చిన్న, మధ్య తరగతి వారికి నూతన కారు కొనుగోలు చేయాలనే కోరిక ఉన్న వారికి కొత్త కార్ల ధరలు అందుబాటులో ఉన్నాయి. జీఎస్టీ తగ్గింపు కార్ల వ్యాపారానికి ఊతమిచ్చే అంశం. వివిధ మోడళ్లలో కార్ల ధరలు రూ.40 వేల నుంచి 60 వేల వరకు తగ్గుతున్నాయి. మా షోరూంలో బుకింగ్‌లు ఘననీయంగా పెరిగాయి. కొత్త రేట్ల ప్రకారం బుకింగ్‌లు చేసుకొని ఈనెల 22 తర్వాత వాహనాలను డెలివరీ ఇస్తున్నాం.

● ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్

బిడ్డ కోసం నాన్న సాహసం



జలపాతంలో దూకి కూతురిని కాపాడి మాట్లాడుతున్న తండ్రి

బోథ్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బిడ్డను కాపాడుకునేందుకు నాన్న సాహసం చేసిన ఘటన ఇది. బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతంలో ప్రమాదవశాత్తు బాలిక జారిపడింది. శనివారం మధ్యాహ్నం పూట నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని అడెల్లి గ్రామానికి చెందిన తన కూతురును బోథ్ హాస్టల్ నుంచి తిరిగి ఇంటికి తీసు కెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం జలపాతం మండలం చూసేందుకు తండ్రి కూతురు జల పాతం వద్దకు చేరుకున్నారు. అయితే నీటి ప్రవాహానికి బాలి క జారి నీళ్లలో పడడంతో చేరుకున్న తండ్రి జలపాతంలో దొరికి బాలికను బయటకు తీయడం జరిగింది. అక్కడే ఉన్న మరో వ్యక్తి సైతం బాలికను కాపాడేందుకు చాలా పాదంలో దూ కారు. ఇద్దరి వల్ల బాలిక ప్రాణాలతో బయటపడింది. కాగా జలపాతం వద్ద కాపలా ఉండాల్సిన వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఈ విధంగా జరిగిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

దసరా సెలవులు ప్రారంభం

» ఇళ్లకు తరలివెళ్తున్న విద్యార్థులు



ఉట్నూర్‌లోని ఆశ్రమ పాఠశాల నుంచి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

ఉట్నూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో శనివారం నుంచి విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. అక్టోబర్ 2న దసరా ఉండడంతో ప్రభుత్వ పాఠశాలలకు 22 నుంచి దసరా సెలవులు ప్రకటించారు. ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు బాలుర ఆశ్రమ పాఠశాల, ఆయా సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు శనివారం నుంచి తమ తమ ఇండ్లబాట పట్టారు. బాలికల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం తల్లిదండ్రులు నేరుగా వచ్చి పిల్లలను తీసుకు వెళ్తున్నారు.

గుట్టుగా మత్తుదందా

- జిల్లాలో గుప్పు గుప్పుమంటున్న గంజాయి
- అమాయక రైతులను ఉచ్చులోకి దింపుతున్న స్మగ్లర్లు
- మారుమూల గ్రామాల్లో అంతరపంటగా సాగు
- పోలీసుల దాడుల్లో వెలుగులోకి వస్తున్న గంజాయి



ఇటీవల గుడిహత్నూర్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు (ఫైల్)

అమాయకులే బలి

డబ్బులు ఆశ చూపుతూ అమాయకులను ఉచ్చులోకి దింపుతున్నారు. యువత, రైతుల నే స్మగ్లర్లు టార్గెట్ చేస్తున్నారు. పట్టుబడుతున్న ప్రతిసారి అమాయకులే కేసుల్లో ఇరుక్కొని కటకటాల్లోకి వెళ్తున్నారు.ఎవరికి అనుమానం రాకుండా మారుమూల గ్రామాల్లో సంచరిస్తూ యథేచ్ఛగా గంజాయిని తరలిస్తున్నారు. అసలు సూత్రదారులు తప్పించుకోవడంతో అమాయకులు బలవుతున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన కొంత మంది బడా వ్యాపారులకు గంజాయి వ్యాపారంతో సంబంధాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. గంజాయిని తరలిస్తూ పట్టుబడిన వారిని బయటకు తీసుకు వచ్చేందుకు వ్యాపారులే సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. ఒప్పందం ప్రకారం ముందే హామీలు ఇ స్తున్నట్లు వినిపిస్తుంది. అయితే స్మగ్లర్లు మాత్రం తమ చేతికి మట్టి అంటకుండా తెలివిగా మత్తుదందాను కొనసాగిస్తున్నారు.

ఆదిలాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంతర్‌పంటగా గంజాయి మొ క్కల సాగు ఆందోళన రేపుతుంది. ప్రతియేడు వ ర్షాకాల సీజన్‌లో గంజాయి మొక్కలు పట్టుబడ డం పరిపాటిగానే మారుతుంది. ఇటీవల ఎక్సైజ్, పోలీసు అధికారులు దాడులు చేసి లక్షల విలువ చేసే గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. అయితే దొరికితే దొంగ లేదంటే దొర అన్న చందంగా యథేచ్ఛగా మత్తు దందా సాగుతుంది. ఇటీవల సిరికొండ, నేరడిగొండ, గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాల్లో పోలీసులు దాడులు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుడిహత్నూర్ మండలం తోషం గ్రామ శి వారులో గంజాయి మొక్కలను సాగు చేస్తున్న తం డ్రి కొడుకులపై కేసులు న మోదు చేశారు. ఈ యేడు జిల్లా వ్యాప్తంగా 120 గంజాయి కేసులు నమోదు కా గా ఇందులో 40 కిలోల ఎండుగంజాయి, 600ల గంజాయి మొ క్కలను స్వాధీన పర్చుకుని ధ్వంసం చేశారు. దీని విలువ రూ.62లక్షల 70వేలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మొత్తం గం జాయి కేసుల్లో 240 మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్రతో పాటు మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన గం జాయి ముఠాలు జిల్లా కేంద్రంలోనే మకాం వేస్తూ దళారులతో రహస్యంగా ఒప్పందాలు చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. జిల్లా సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల్లో నిఘా కొరవడుతుందన్న ఆరోపణలు వ స్తున్నాయి. అలాగే అదును చూసి అడ్డదారుల్లో స్మగ్లర్లు అక్రమదందాను కొనసాగిస్తున్నారు.

ముందే అడ్వాన్సులు..

స్మగ్లర్లు రహస్యంగా రైతులతో ముందే ఒప్పందాలు చేసుకుంటు అడ్వాన్సులు చెల్లిస్తున్నట్లు తెలుస్తుంది. గంజాయి మొక్కల సంఖ్యను బట్టి అడ్వాన్సులను చెల్లిస్తున్నట్లు వినిపిస్తుంది. గంజాయి సాగును చేసే విధంగా అమాయక రైతులను ఉచ్చులోకి దింపుతున్నారు. జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటలైన పత్తి, సోయ, మొక్కజొన్న, జొన్న పంటల్లో అంతర్‌పంటగా గంజాయిని సాగు చేస్తున్నట్లు తెలుస్తుంది. అడపా దడపగా అధికారుల తనిఖీల్లో పట్టుబడుతున్న మారుమూల రహస్య ప్రాంతాల్లో భారీగా గంజాయి సాగవుతున్నట్లు సమాచారం. రెండు, మూడేళ్లగా గంజాయిని సాగు చేస్తూ పట్టుబడుతున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపి వేస్తున్నారు. అయినా మత్తుదందాకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడడం లేదు. కొంత మంది గంజాయి సాగును ఉపాధి మార్గంగా మార్చుకొని సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అంతర్ పంటగా సాగైన గంజాయిని అక్రమ

(మిగతా 6వ పేజీలో)

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైద్యారోగ్య శాఖలో కాం ట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చె ల్లించడంతో పాటు ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మాధవరావ్ విజ్ఞా న కేంద్రంలో శనివారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ అం డ్ వర్కర్స్ యూనియన్ రిమ్స్ విభాగం అయిదవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టవలసిన భవి ష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై నేతలు చర్చించారు. ఏండ్లుగా రిమ్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదని, ఇచ్చే తక్కువ వెతనంలోనూ కాంట్రాక్టర్‌కు పీ.ఎఫ్ కట్టాల్సి వస్తోందని అన్నమొల్ల కిరణ్ అన్నారు. రిమ్స్ లో కాంట్రాక్టర్‌ను నియమించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 22 నుంచి నిరసనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, నేతలు సురేందర్, ఖలీల్, అగ్గిమళ్ల స్వామి పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వంట వార్పు



ఉట్నూర్‌లో వంట వార్పు చేసి సామూహికంగా భోజనం చేస్తున్న దినసరి ఉద్యోగులు

ఉట్నూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ దినసరి ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వంటవార్పు నిర్వహించారు. శనివారం 9వ రోజుకు చేరిన నిరవధిక సమ్మెలో భాగంగా ఉద్యోగులందరు వంటవార్పు చేసి నిరసన తెలిపి అక్కడే సామూహిక భోజనాలు నిర్వహించారు. ఈ సంరద్భంగా మాజీ సర్పంచ్ బొంత ఆశారెడ్డి, ఉట్నూర్ సార్‌మేడి సలాందేవరావులు సంఘీభావం తెలిపారు. వంటలకయ్యే ఖర్చులను ఐటీడీఏ ఏపీశక్త పీవీటీజీ మేస్రం మనోహర్ ఉద్యోగులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాజన్న, రాథోడ్ బాపురావు, మాణిక్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుప వంతెనల నిర్మాణానికి అనుమతివ్వండి

● అటవీ శాఖ మంత్రి, పీసీసీఎఫ్ లను కలిసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



అటవి శాఖ మంత్రి కొండ సురేఖను కలిసిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్



పీసీసీఎఫ్ సువర్ణను కలిసి మెమోరాండం సమర్పిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలో ఉన్న మారుమూల ప్రాంతాల గిరిజన గ్రామాల ప్రజలు వాగులు దాటడానికి నిర్మించ తలపెట్టిన ఇనుప వంతెనల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలంటూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అటవీ శాఖ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ డా.సువర్ణలను కలిసి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అభ్యర్థించారు. శనివారం హైదరాబాదులోని అరణ్య భవనంలో మంత్రిని పీసీసీఎఫ్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ఉన్న అటవీ ప్రాంతంలో నివసించే గిరిజన ప్రజలు రవాణా కష్టాలు తొలగేలా స్టీల్ బ్రిడ్జిల నిర్మాణానికి తగు అనుమతులు మంజూరు చేసి త్వరతగతిన నిర్మాణం పూర్తి చేయడానికి సహకరించాలని కోరానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉట్నూర్ పెంబి మండలాల్లో మొత్తం ఆరు బ్రిడ్జిల నిర్మాణనికి దాదాపు రూ.17.92 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఏదైనా గ్రాంట్ ద్వారా ఆ మొత్తం నిధులు మంజూరు చేయాలని ఇటీవల మంత్రి సీతక్కని కలిసి కోరానన్నారు. ఆ నిధులు విడుదల అవ్వగానే వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయడానికి సహకరించాలన్నారు. అదే మాదిరి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణనికి సరిపడేంత ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సరిపడేంత ఇసుక, బండ సరఫరాకు ఆటంకాలు లేకుండా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ఊరట కలిగించాలని అటవీ శాఖమంత్రిని కోరామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలంటే ఇసుక బండ సరఫరాకు ఆటంకాలు లేకుండా చూడాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నిరు.

విద్యార్థుల ఉన్నతికి పాటు పడాలి

● కలెక్టర్ రాజర్షి షా సూచన..



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, సాంఘిక సంక్షేమ, గురుకుల, మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమావేశం నిర్వహించారు. మొదటి సంవత్సరం అడ్మిషన్‌లు, యు డైస్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం, గత సంవత్సరం ఫలితాలపై సమీక్ష జరి పారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ మంచి ఫలితాలను సాధించేందుకు ఆచరణాత్మక విద్యా బోధనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ విద్యా వ్యవస్థను నమ్మి ప్రభుత్వ కళాశాలల్లో చేరారని, వారి ఆశలను వమ్ము చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు విద్యా బోధన జరగాలని సూచించారు. ప్రతీ కళాశాలలో వారం వారం స్లిప్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా విద్య బోధన జరగాలన్నారు. ఆ తర్వాత నెలవారి పరీక్షలు, త్రైమాసిక పరీక్షలు, అర్ధ వార్షిక పరీక్షలు, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు.

అమ్మో.. పులి

7

» బోథ్ అడవుల్లోకి మళ్లీ రాక » భయాందోళనలో ప్రజలు

యూరియా పంపిణీలో నిర్లక్ష్యం.. రైతులకు శాపం

● రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న



బేల రంకంలో రైతులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగురామన్న

జైనథ్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రైతులకు యూరియా పంపిణీ శాపంగా మారిందని రాష్ట్ర మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం బేల మండలంలోని డోప్టాల గ్రామం రంకం గ్రామ పరిధిలో గల కోడిమత యాదవ్ అనే రైతును యూరియా కోసం పోలీసులు తీవ్ర ఇబ్బందులు పట్టిన దానిపై రైతులను ఆయన పరామర్శించి మాట్లాడారు. యూరియా కోసం వచ్చిన రైతు మాధవ్‌రావ్‌ను పోలీసులు వ్యవసాయ అధికారులు దౌర్జన్యాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అధికారులుగాని నాయకులుగాని వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వారేనని గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతుల పక్షాన మరోసారి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆర్. మనోహర్‌రావు, బీఆర్ఎస్ బేల మండల పార్టీ అధ్యక్షుడు కళ్లెం ప్రమోద్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సతీష్‌పవార్, మాజీ సర్పంచ్ తేజరావ్‌లతో పాటు రంకం గ్రామ రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేటి సూర్యగ్రహణం మనకు కనిపించదు

● శ్రావణ్‌కుమార్ జోషి



శ్రావణ్‌కుమార్ జోషి

నేరడిగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివారం అమావాస్య రోజు సంభవించే సూర్యగ్రహణం మన భారతదేశంలో కనపడదని శ్రావణ్ కుమార్ జోషి అన్నారు. యూట్యూబ్, సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మి ఆందోలన చెందవద్దని, రాబోయే సంవత్సరం మార్చిలో చంద్ర గ్రహణం ఉంటుంది. అప్పటి వరకు ఎలాంటి గ్రహణాలు లేవని, అదే విధంగా సెప్టెంబరు 22 నుంచి దేవి శరన్నవరాత్రులు ప్రారంభమై అక్టోబర్ 2వ తేదీ దసరాతో ముగుస్తాయి. ప్రతి సంవత్సరంలా కాకుండా ఈసారి నవరాత్రులు 11 రోజులు రావడం విశేషమన్నారు.

శునకాలతో జనం భయం



కౌటాబి గ్రామంలో రోడ్లపై తిరుగుతున్న కుక్కలు

బోథ్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలం లో కుక్కల బెడద తీవ్రమైంది. అన్ని గ్రామాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పగలు, రాత్రి కుక్కల వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు.

● పశువులపై దాడి

రేబిస్ వ్యాధి సోకిన కుక్కల వల్ల సోనాల మండలంలోని చింతల బోరి గ్రామంలో కుక్క కాటు వల్ల అయిదు పశువులు మృత్యువాత పడ్డాయి. దీంతో గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు రాత్రిపూట గ్రామాలలో బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. గ్రామ పంచాయతీల వారు కుక్కలను గ్రామాల నుండి పంపించాల్సిన అవసరం ఉందని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ



ఈవీఎం గోదాం వద్ద కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంలో కలెక్టర్ రాజర్షి షా త్రైమాసిక తనిఖీలో పా ల్గొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఈవీఎంల గోదాంల తనిఖీ జరగాల్సిన నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా పర్యవేక్షణలో తనిఖీ నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై తనిఖీని సమీక్షించారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

గుడిహత్నూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గౌడ సంఘాల నాయకుల అరెస్టు అప్రజాస్వామ్యమని మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి రంగు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గౌడ కులస్థులపై వీడీసీ జరిపిన దాడిపై స్పందించిన మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్‌ను నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆయన నివాసంలో అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు గౌడ సమాజానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం గౌడ కులస్థులను బెదిరిస్తూ పోలీసులు అక్రమ అరెస్టు చేయడం మానుకోవాలన్నారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో నాయకులు బాలసాని, నారాయణ్ గౌడ్, ఏ. శ్రీనివాస్ గౌడ్, రంగు నాగరాజ్ గౌడ్, అరుగుల సంతోష్ గౌడ్, భూపతి గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆస్పత్రుల అభివృద్ధికి కృషి చేయాలి

● కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్



మంత్రి దామోదర రాజానర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న గజేందర్

నేరడిగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో గల ప్రభుత్వ ఆసుపత్రుల కోసం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఆరోగ్య వైద్యశాఖ మంత్రి దామోదర రాజానర్సింహాను శనివారం హైదరాబాద్ లో గల మంత్రి స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ తెలిపారు. స్పందించిన మంత్రి త్వరలోనే చర్చించి నియోజకవర్గంలోగల మండలాల్లోని ప్రభుత్వ ఆస్పత్రు ల్లో కొరతగా ఉన్న వైద్యులను వైద్య సిబ్బందిని నియమించి ఆసుపత్రుల అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యం అందేలా చూడాలని తెలిపారని అన్నారు అయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.